క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చింతల్: సుభాష్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ బ్యాంక్ కాలనీ, 11 కేవీ సాయి బాబానగర్, 11 కేవీ పద్మానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బ్యాంక్ కాలనీ, రాఘవేంద్రనగర్, వెంకటేశ్వర్‌నగర్ , పద్మానగర్ ఫేజ్-2, శ్రీరామ్‌నగర్, బాపునగర్, ఎంఎన్ రెడ్డి నగర్, వాజ్‌పేయినగర్, సాయిబాబా నగర్, నాగులకుంట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలో మీనాక్షి, సుచిత్ర, రామ్‌రాజునగర్, జయరామ్ నగర్, ప్రాగాటూల్స్, పైపులైన్ రోడ్డు, గాయత్రి నగర్, జైన్, జీడిమెట్ల తదితర ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, గ్రీన్‌పార్కు, జయరామ్‌నగర్, భజరంగ్ హిల్స్, గాయత్రినగర్, గోదావరి హోమ్స్, పైపులైన్ రోడ్డు, ప్రాగాటూల్స్ కాలనీ, బీహెచ్ఈఎల్, రామ్‌రాజ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దుండిగల్ కమిషనర్‌గా సత్యనారాయణ

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు బదిలీ అయ్యారు. ఆయనను శంషాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. భోగీశ్వర్లు స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సూపరింటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సత్యనారాయణ దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టానున్నారు.

జూన్ 30 వరకు కంటి వెలుగు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు సెంటర్లు గురువారం నుంచి అందుబాటులోకి వస్తాయని ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలియజేశారు. నిజాంపేట్ 14వ వార్డులోని కొలన్ రాఘవరెడ్డి కమ్యూనిటీ హాలులో ఉదయం 9 గంటలకు మేయర్ నీలారెడ్డి లాంఛనంగా కంటి వెలుగును ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 19 నుంచి జూన్ 30వ తేదీ వరకు కంటి వెలుగు సెంటర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 5గంటల వరకు కంటి సంబంధిత సమస్యలతో బాధపడే వారు సెంటర్‌కు హాజరై పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

ఎన్‌టీఆర్‌కు నివాళి

నిజాంపేట్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు (ఎన్‌టీఆర్) వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం నిజాంపేట్‌లో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాపితం చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో పేద, బడుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్‌లో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో వాకింగ్ ట్రాక్‌లో టైల్స్ వేయని దృశ్యం



సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో బండరాళ్లు

పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- మున్సిపాలిటీలో అభివృద్ధికి నోచుకోని పార్కులు
- పనులు ప్రారంభమైన చోట ముందుకు సాగని పనులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మదర్‌థెరిస్సా పార్కులో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



మదర్ థెరిస్సా పార్కులో విరిగిన పిల్లల ఆట వస్తువులు

నిజాంపేట్: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. లక్షలాది నిధులు కేటాయించినా అవి వృథాగా మారుతున్నాయి. చాలా ప్రాంతాల్లోని పార్కుల్లో అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా పార్కు పనులు నత్తనడకన సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కొన్ని పార్కుల్లో నిర్వహణ కొరవడటంతో ఇటీవల ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు తప్పు పడుతున్నాయి. పిల్లల ఆటల వస్తువులు విరిగిపోయినా వాటిని బాగు చేయించే నాథుడే కరువయ్యారు. పార్కుల్లో పచ్చదనం కొరవడి పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్ర వాతావరణాన్ని తలపిస్తున్నాయి.
- ఇక వాకింగ్ ట్రాక్‌ల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మట్టిపోసి చదును చేసిన కాంట్రాక్టర్ టైల్స్‌వేయకుండా వదిలేయడంతో వాకింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- ప్రగతినగర్ ప్రాంతంలోని వాసవి లేఅవుట్, ఎన్ఆర్ఐ కాలనీ, ఆర్ కే లేఅవుట్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్, ఆదిత్య గార్డెన్, గాయత్రి లేఅవుట్ ప్రాంతాల్లో పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు..



నిర్వహణ లోపించిన పంచతత్వా పార్కు

నిధులు మంజూరైనా సాగని పనులు..

- ప్రగతినగర్‌లోని 23వ డివిజన్ పరిధిలోని మదర్ థెరిస్సా పార్కుకు రూ.25 లక్షలు, సర్వేపల్లి రాధాకృష్ణ పార్కుకు రూ.20 లక్షలు, చాకలి ఐలమ్మ పార్కు (రూ.15 లక్షలు), బాబు జగ్జీవన్‌రామ్ పార్కు (రూ. 5 లక్షలు), సరోజినినాయుడు పార్కు (రూ. 15 లక్షలు) నిధులు మంజూరు అయ్యాయి. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సగం మేరకు పనులు చేపట్టి ఆపై పత్తా లేకుండా పోయారు.

పచ్చదనం కరువైంది..



ప్రగతినగర్ పార్కులో పచ్చదనం కరువైంది. ఎక్కడ పనులు అక్కడే వదిలేయడంతో ఆహ్లాదభరితంగా ఉండాల్సిన పార్కు కళావిహీనంగా తయారైంది. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు విరిగిపోయాయి. పార్కులో ఎక్కడ పడితే అక్కడ నిర్మాణ సామగ్రి దర్శనమిస్తోంది. ఇంకెన్నాళ్లు పనులు చేపడతారు.

- రామ్మోహన్‌రావు, ప్రగతినగర్

వాకింగ్ ట్రాక్ కరువాయే..



పార్కులో వాకింగ్ చేద్దామని వస్తే వాకింగ్ ట్రాక్ లేదు. కూర్చోవడానికి బెంచీలు కరువయ్యాయి. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణ కొరడటంతో పరికరాలు తుప్పు పడుతున్నాయి. సాయంత్రం ఆహ్లాదం కోసం వస్తే నిరాశే ఎదురవుతోంది. పార్కులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అధికారులు పట్టించుకుని పార్కు నిర్వహణను మెరుగు పరచాలి.

- రామ్‌ప్రసాద్, ప్రగతినగర్

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి..



పార్కుల్లో సగంలో నిలిచిపోయిన అభివృద్ధి పనుల విషయమై కౌన్సిల్ సమావేశంలో పలు మార్లు లేవనెత్తాను. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారిలో చలనం ఉండటం లేదు. నా డివిజన్ పరిధిలోని పార్కులకు లక్షల్లో నిధులు కేటాయించాం. అయినా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని పార్కు అభివృద్ధి పనులు జరిగేలా చూడాలి.

- కార్పొరేటర్ శ్రీనివాస్‌యాదవ్

ఖమ్మం సభకు తరలిన గులాబీ దళం



కుత్బుల్లాపూర్: ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయం నుండి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మల్కాజ్‌గిరి మైనంపల్లి హన్మంతరావు, కూకట్‌పల్లి మాధవరం కృష్ణారావు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ అన్ని జాతీయస్థాయిలో ప్రతిపక్షాలను కలుపుకుని దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేయనున్నారని పేర్కొన్నారు.

వార్డుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

దుండిగల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బుధవారం దుండిగల్ 5వ వార్డులో రూ.37 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... వార్డులలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ సర్పంచ్‌లు కావలి గణేష్, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జక్కుల శ్రీనివాస్, కుంటి నాగరాజు, సుధాకర్‌రెడ్డి, ప్రేమకుమార్, శంకరయ్య, స్వామి, భిక్షపతి, దంతి మహేష్, నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, ఆనంద్‌కుమార్

మతి స్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం

నిజాంపేట్: మతి స్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిజాంపేట్‌కు చెందిన కోమలి జయరామ్(55) గతనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాని నేటికి అతని ఆచూకీ లభించకపోవడంతో జయరామ్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో అతని ఫోటోతో కూడిన వాల్ పోస్టర్లను అంటించారు. అతనికి గత కొన్ని రోజులుగా మతి స్థిమితం సరిగా ఉండటం లేదని, ఆచూకీ తెలిస్తే ఫోన్ నం.9849461842 / 9705364888లో సంప్రదించాలని కోరుతున్నారు.

జేపీ నడ్డా పదవి కాలాన్ని పొడిగించడం హర్షణీయం

మోతీనగర్: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవి కాలాన్ని పొడిగించడం హర్షించదగ్గ విషయమని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టింగిల్కర్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేపీ సారథ్యంలో దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో విజయం ఖాయమన్నారు. పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో జేపీ నడ్డా సారథ్యం వహించి విజయం సాధించి విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జేపీ నడ్డా అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన పలుమార్లు రాష్ట్రంలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జేపి నడ్డా సారథ్యంలో ముచ్చటగా మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ పదవీ బాధ్యతలు చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు.

నేటి నుంచి రెండో విడత కంటి వెలుగు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం (నేడు) ప్రారంభం కానుంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కంటి వెలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఉదయం 9గంటలకు ప్రజలకు కళ్ల పరీక్షలు ప్రారంభమవుతాయని ఉపకమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి ఓ ప్రకటనలో తెలియజేశారు. సెంటర్ల వద్ద జనం తాకిడిని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షలు చేయించుకున్న వెంటనే కళ్లద్దాలు ఇచ్చే ఏర్పాట్లు చేశామని తెలిపారు. తీవ్ర కంటి సమస్యలతో బాధపడే వారికి ఉచిత శస్త్రచికిత్సలు చేయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెంటర్లలో సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి వెలుగు కేంద్రాలు ఇవే..

- గాజులరామారం డివిజన్ పరిధిలోని బతుకమ్మ బండ కమ్యూనిటీహాల్
- జగద్గిరిగుట్ట డివిజన్‌లో మగ్దూమ్‌నగర్ నగర్ సాయిబాబా కళ్యాణ మండపం
- చింతల్ డివిజన్‌లో భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్
- సూరారం డివిజన్‌లో శివాలయనగర్ అంబేడ్కర్ భవనం
- రంగారెడ్డినగర్ డివిజన్‌లో గాంధీనగర్ కమ్యూనిటీహాల్
- సుభాష్‌నగర్ డివిజన్‌లో లూయిస్ బ్రెయిలీ కమ్యూనిటీహాల్, సుభాష్‌నగర్ జీనియస్ హైస్కూల్
- కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పద్మానగర్ ఫేజ్-2 కమ్యూనిటీహాల్
- జీడిమెట్ల డివిజన్‌లో దుర్గా ఎస్టేట్ కమ్యూనిటీహాల్

గాత్రంతో వాకిటి రామ్‌రెడ్డి మంత్రముగ్ధులను చేస్తారు

నందిని సిధారెడ్డి

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన మానస టూల్‌టెక్ అధినేత, ఆత్మీయ భారతి సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు ఘన సన్మానం అందుకున్నారు. మంగళవారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత్ పరిషత్‌లో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో గంట జలంధర్‌రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన దారిదీపాలు గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులుగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిరసం అధ్యక్షుడు పొరెడ్డి రంగయ్య తదితరులు వాకిటి రామ్‌రెడ్డి సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ మెమోంటో, శాలువతో సత్కరించి దారిదీపాలు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. వాకిటి రామ్‌రెడ్డి జన చైతన్య పాటలు రాయడంలో పట్టుసాధించారని, తన గాత్రంతో సభికులను మంత్రముగ్ధులు చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమములో ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాభారతి కవులు ఎస్.ఎస్.చారి, ఉప్పలయ్య, రవీంద్రభారతి సేవకురాలు హేమలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకిటి రామ్‌రెడ్డికి మెమోంటో అందజేస్తున్న తెలంగాణ భాష సాంస్కృతిక మండలి సభ్యులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



చెరుకుపల్లి కాలనీలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ అసెంబ్లీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో హన్మంతరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని 49 బూత్‌ల స్థాయి కమిటీల ఎన్నికను పూర్తి చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరిరావు, జేమ్స్, గణేష్, వీరేష్ గుప్తా, శివ, గొల్ల జాన్, డివిజన్ ఏ-బ్లాక్ సెక్రటరీ బాలయ్య, మాజీ వార్డ్ సభ్యులు ఆనందరావు, సిద్దయ్య, ప్రదీప్, దిలీప్‌గౌడ్, నర్సింహారెడ్డి, వనజ, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు షురూ

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల బాలానగర్ బాయ్స్-1 హైదర్‌నగర్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 55, క్రిస్టియన్ మైనార్టీలకు 5, బీసీ 10, ఎస్సీ 5, ఎస్టీకి 3, ఓసీకి 2 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ముస్లిం మైనార్టీలకు 28, క్రిస్టియన్ మైనార్టీలకు 2, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి 1, ఓసీకి 1 సీటు ఉన్నాయన్నారు. బైపీసీలో ముస్లిం మైనార్టీలకు 28, క్రిస్టియన్ మైనార్టీలకు 2, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, ఓసీలకు 1 సీటు ఉన్నాయని అదే విధంగా 6,7,8 తరగతుల వారికి కూడా ముస్లిం మైనార్టీ విద్యార్థులకు సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 914029881806, 7989486938, 7569241 410, 7331170802లో సంప్రదించాలన్నారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన టిప్పర్

డ్రైవర్ పారిపోవడంతో టిప్పర్ యజమాని అరెస్టు

కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ ఆల్వాల్‌కు చెందిన ప్రణయ ఆంథోని బైక్‌పై మేడ్చల్ నుంచి వస్తుండగా కొంపల్లి ఫ్లైఓవర్ సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ లారీ (టీఎస్ 35 టీ 1889) ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రణయఆంథోని కూడి చేయి విరిగింది. దీంతో సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ప్రవీణ్ పారిపోవడంతో టిప్పర్ నంబరు ఆధారంగా యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యక్తిని ఢీకొట్టి గాయపర్చడమే కాకుండా, టిప్పర్ నంబర్ ప్లేట్‌పై నంబర్లు సక్రమంగా లేకపోవడంతో వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ప్రణయ ఆంథోని



టిప్పర్ నంబర్ ప్లేట్‌పై అస్పష్టంగా నంబర్

పక్షి రాజా..

గాలిపటాలు ఎగురవేసేవారు పక్షులకు ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని పర్యావరణ పరిరక్షకుడు కోల రవీందర్‌ముదిరాజ్ అన్నారు. కొన్ని రోజుల నుంచి చైనా మాంజాతో గాలిపటాలు ఎగరవేయడంతో ఆ మాంజాలు పక్షుల పాలిట ఉరితాళ్లుగా మారాయని పేర్కొన్నారు. బుధవారం సూరారంకాలనీలో మాంజా దారానికి ఓ పావురం చిక్కుకోగా ఆయన వాటిని తొలగించి పక్షులపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. - సుభాష్‌నగర్



పావురానికి చిక్కుకున్న మాంజాను తొలగిస్తున్న రవీందర్‌ముదిరాజ్

కూటి కోసం కోటి విద్యలు

కూటి కోసం కోటి విద్యలు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని క్వారీ గుంతలలో భవనాల డెబ్రిస్‌ను తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. డెబ్రిస్‌లో ఉండే ఇనుప చువ్వలను స్థానికంగా ఉండే పిల్లలు, పెద్దలు సేకరిస్తున్న దృశ్యాన్ని బుధవారం సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. స్క్రాప్ దుకాణాల్లో వాటిని అమ్మి వచ్చిన డబ్బుతో కడుపు నింపుకుంటున్నారు. - సుభాష్‌నగర్



బడిలో అమెరికన్ టూరిస్టులు



విద్యార్థులతో అమెరికన్ టూరిస్టులు, హెచ్ఎం సుబ్బారావు

చింతల్ డివిజన్ నెహ్రూనగర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌ను బుధవారం క్రిస్టియన్ సర్వీస్ యూనిట్ (సీఎస్‌యూ) ప్రతినిధి టీఎల్ రెడ్డి ఆధ్వర్యంలో అమెరికన్ టూరిస్టులు డాక్టర్ అలీడా వార్డ్, రొనీ వైడర్, కామెరూన్ నరేన్ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న సీఎస్‌యూ కార్యక్రమాలను పరిశీలించిన వారు విద్యార్థులతో కలిసి ఆడి పాడారు. ఈ సందర్భంగా సీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు ప్రస్తుతిస్తూ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. - చింతల్